

డిఆర్‌యుసి సభ్యునిగా సూర్యప్రకాష్



సూర్యప్రకాష్

ఇచ్ఛాపురం: రైల్వే యూజర్స్ కన్సలేటివ్ కమిటీ (డిఆర్‌యుసి) ఖుర్దా డివిజన్, ఈస్ట్‌కోస్ట్ రైల్వే సభ్యునిగా పట్టణానికి చెందిన కట్టా సూర్యప్రకాష్‌ను ఆదివారం ంనియమించారు. డిఆర్‌ఎం ఖుర్దా డివిజన్ నుంచి సమాచారం వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక రైల్వే యూజర్ కమిటీ సభ్యునిగా ఉన్న తనను, డిఆర్‌యుసి సభ్యునిగా నియమించినందుకు ఖుర్దా డిఆర్‌ఎం హెచ్‌ఎస్ బజ్వా, భువనేశ్వర్ జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫన్కవాల్కిలకు కృతజ్ఞతలు తెలియజేశారు. రైల్వే సమస్యల పరిష్కారానికి, ఇచ్ఛాపురం స్టేషన్ అభివృద్ధికి, ప్రధాన రైళ్ల నిలుపుదలకు తన వంతు కృషి చేస్తాను అన్నారు. ఇప్పటికే అనేక సమస్యలు రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు.

పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో ముందుకు...

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళ్లర్పిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం ఉండాలన్న లక్ష్యంతో రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి, ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు అమరజీవి అని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి సందర్భంగా బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యాన పాతబస్టాండ్ వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు విశేష కృషి చేసిన మహనీయుడు అని అన్నారు. ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. గాంధీ బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాల కోసం పనిచేశారని తెలిపారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని, స్వాతంత్ర్యానంతరం ప్రత్యేక రాష్ట్రం కోసం చేపట్టిన ఉద్యమంలో ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలు అర్పించారన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ త్యాగమూర్తుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమశాఖ అధికారి అనురాధ, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో...

అమరజీవి పొట్టి శ్రీరాములు, ఉక్కు మనిషిగా పేరుగాంచిన సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో వారి చిత్రపటాలకు ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, గాంధేయవాది, తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం సాధన కోసం జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుడు అని కొనియాడారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ స్వాతంత్ర్య యోధునిగానే కాకుండా స్వాతంత్ర్యానంతరం పలు సంస్థానాలు భారతదేశంలో విలీనం కావడానికి విశేష కృషి చేశారని చెప్పారు. అలాంటి మహనీయులను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి కె.వి రమణ, డిఎస్‌పి ఎల్.శేషాద్రి, సిఐ శ్రీనివాసరావు, ఆర్‌ఐ కె.నర్సింగరావు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో...

కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి కలెక్టరేట్ ఎఒ సూర్యనారాయణ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో బిసి సంక్షేమశాఖ అధికారి అనురాధ, జిల్లా పౌర సరఫరాల అధికారి సూర్యప్రకాశరావు, కలెక్టరేట్‌లోని పలు విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి



మాట్లాడుతున్న జెవివి నాయకులు

పక్షుల విహార కేంద్రాన్ని పరిరక్షించాలి

జనవిజ్ఞాన వేదిక పర్యావరణ అధ్యయన యాత్ర

ప్రజాశక్తి - టెక్కలి

మండలంలోని తేలినీలాపురంలో గల విదేశీ పక్షుల విహార కేంద్రాన్ని పరిరక్షించాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామారావు అన్నారు. జెవివి రాష్ట్ర పర్యావరణ సబ్ కమిటీ ఆధ్వర్యాన చేపడుతున్న ఉత్తరాంధ్ర పర్యావరణ అధ్యయన యాత్రలో భాగంగా ఆదివారం ఈ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్లుగా ఫెలికాన్ పక్షులు సైబీరియా నుంచి వలస వచ్చి తేలినీలాపురంలో నివాసం ఉండి మళ్లీ ఆ దేశానికి వెళ్తున్నాయన్నారు. ప్రస్తుతం మూలపేట పోర్టు వాహనాల రవాణా, ఇతర కారణాల రీత్యా పక్షుల వలస కేంద్రానికి నష్టం వాటిల్లుతోందన్నారు. పక్షుల విహార వలస కేంద్రానికి రక్షణ కల్పించేందుకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక పర్యావరణ సబ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కె.వి.వి సత్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.త్రిమూర్తులు రెడ్డి, జెవివి రాష్ట్ర నాయకులు వి.రాజగోపాల్, సమతా రాష్ట్ర కన్వీనర్ జి.నిర్మల, పాత్రికేయులు చింతాడ కృష్ణారావు, బెందాళం కృష్ణారావు, జెవివి రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, జిల్లా అధ్యక్షులు కె.కామేశ్వరరావు, జిల్లా పర్యావరణ సబ్ కమిటీ కన్వీనర్ పూజారి గోవిందరావు, జెవివి విశాఖ జిల్లా అధ్యక్షులు ఎస్.వి.కె పరశురాం, ప్రధాన కార్యదర్శి కె.శేషగిరిరావు, పర్యావరణ సబ్ కమిటీ జిల్లా కన్వీనర్ పి.లక్ష్మణస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగులను తొలగించడం అన్యాయం




సమావేశంలో మాట్లాడుతున్న అప్పారావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వైద్యారోగ్యశాఖలో 22 ఏళ్లుగా కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న ఎంపిహెచ్ఎ (మేల్) ఉద్యోగులను అర్థాంతరంగా విధుల నుంచి తొలగించడం అన్యాయమని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.మురళి, డి.సాయిప్రసాద్, ఇఎస్ సంఘం నాయకులు పొట్నూరు అప్పారావు అన్నారు. తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో 2002లో జారిచేసిన నోటిఫికేషన్ అనుసరించి డిఎస్‌సి ద్వారా మెరిట్ లిస్ట్ ప్రాతిపదికన 2003లో 2,324 మందిని ఒప్పంద ఉద్యోగులుగా నియమించినట్లు తెలిపారు. కోర్టు ఉత్తర్వులను అనుసరించి 2006లో 1780 మందిని నియమించారన్నారు. గడిచిన కాలంలో వీరంతా ఆ శాఖ పరిధిలో అనేక రకాలైన విధులు నిర్వర్తించారని గుర్తుచేశారు. ప్రభుత్వంలో కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ కోసం నియమించిన గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ కమిటీ ఆదేశాలను అనుసరించి 1200 మందిని నియమించారని చెప్పారు. 2013 సెప్టెంబరు 9న 1200 మందిని విధుల్లోకి తీసుకున్నారని తెలిపారు. తక్షణమే తిరిగి వారిని విధుల్లోకి తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యం చేసుకుని తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. సమావేశంలో కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షులు ఆర్.సురేష్‌బాబు, టిఎన్‌టియుసి నాయకులు ఎస్.గోవిందరావు, 108 ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు టి.విజయమోహన్, సచివాలయ ఉద్యోగుల సంఘం నుంచి ఎన్.వి లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ల యూనియన్ నాయకులు బి.మురళి, జగదీష్ పాల్గొన్నారు.

పని విధానంపై నిర్దిష్ట ఆదేశాలు ఇవ్వాలి

యునైటెడ్ గ్రామ, వార్డు సచివాలయం ఆరోగ్య కార్యదర్శుల సంఘం



సమావేశంలో మాట్లాడుతున్న సాయిప్రసాద్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లా వైద్యారోగ్యశాఖ పరిధిలో ఎంపికై గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉన్న సుమారు 600 మంది ఎఎన్‌ఎం గ్రేడ్-3 ఆరోగ్య కార్యదర్శులు ఎవరు పరిధిలో కొనసాగాలన్న దానిపై ప్రభుత్వం నిర్దిష్ట ఆదేశాలు ఇవ్వాలని యునైటెడ్ గ్రామ, వార్డు సచివాలయ ఆరోగ్య కార్యదర్శుల సంఘం నాయకులు పొట్నూరు అప్పారావు, డి.సాయిప్రసాద్, వెంకటలక్ష్మి డిమాండ్ చేశారు. నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సచివాలయ వ్యవస్థలో మార్పులు చేస్తూ ఆరోగ్యశాఖ పనులు మాత్రమే ఎఎన్‌ఎంలు చేయాలని చెప్పి ఇతర శాఖల పనుల నుంచి ఉపశమనం కల్పించిందన్నారు. ఉదయం తొమ్మిది నుంచి నాలుగు గంటల వరకు సమయపాలన నిర్దేశిస్తూ ఇచ్చిన జిఒలు, సర్క్యులర్లు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని చెప్పారు. పంచాయతీరాజ్, వైద్యారోగ్యశాఖల శాఖల అధికారులు వారికి నచ్చిన రీతిలో పనులు అప్పగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వేలు, లక్ష్యాలు, సమయపాలన, జీతభత్యాల చెల్లింపులో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఈ సమస్యను ముఖ్యమంత్రి, వైద్యారోగ్యశాఖ మంత్రికి విన్నవించినా పరిస్థితిలో మార్పు లేదన్నారు. కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్యోగులను వారి మాతృ శాఖ నుంచి దూరం చేయొద్దని స్పష్టం చేసినా, క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదన్నారు. హాజరు విషయంలో వైద్యారోగ్యశాఖ అధికారులు ఉదయం తొమ్మిది గంటలకు ఫేస్ రికగ్నైజేషన్ కోరుతుంటే, పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఉదయం పది గంటలకు వేయాలని చెప్తున్నారని తెలిపారు. సాయంత్రం కూడా రెండు శాఖల మధ్య గంట వ్యత్యాసం ఉండడం వల్ల తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామన్నారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు.

పకడ్బందీగా శారీరక దారుఢ్య పరీక్షలు

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి



పోలీసు అధికారులకు సూచనలు చేస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

పోలీస్ కానిస్టేబుల్ ఎంపిక ప్రక్రియలో భాగంగా శారీరక అర్హత దారుఢ్య పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు అధికారులను ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుల్స్ సివిల్, ఎపిఎస్‌పి పోస్టుల కోసం ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియెన్సీ పరీక్షలు ఈనెల 30వ తేదీ నుంచి జరుగనున్నాయని చెప్పారు. జిల్లాకు సంబంధించిన అభ్యర్థుల శారీరక దారుఢ్య పరీక్షలు నిర్వహించనున్న స్థానిక జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు పోలీస్ మైదానాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. పరీక్షల నిర్వహణకు ఎటువంటి లోపాలు లేకుండా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని సూచించారు. వంద మీటర్లు, 1600 మీటర్ల పరుగు, లాంగ్ జంప్‌కు సంబంధించిన ట్రాకులను క్షుణ్ణంగా పరిశీలించి, సిద్ధం చేయాలని ఆదేశించారు. అభ్యర్థుల కోసం వైద్య శిబిరం, మంచినీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈవెంట్ల నిర్వహణలో ఎటువంటి లోపాల్లేకుండా పటిష్టంగా నిర్వహించేందుకు అన్నిరకాల ఏర్పాట్లు చేయాలని చెప్పారు. అవసరమైన మౌలిక వసతులు సమకూర్చుకొని పూర్తిస్థాయిలో మైదానాన్ని సిద్ధం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఆయన వెంట అదనపు ఎస్‌పి కె.వి రమణ, ఎఆర్ డిఎస్‌పి ఎల్.శేషాద్రి, ఇతర పోలీసు అధికారులు ఉన్నారు.



వరి పంటను కోస్తున్న కూలీలు

ఖరీఫ్ రైతుని వీడని కష్టాలు

ప్రజాశక్తి - కవిటి

ఖరీఫ్ రైతులకు కష్టాలు వీడడం లేదు. నాట్లు మొదలుకొని నూర్పుల వరకూ ఏదో సమస్య వెంటాడుతూనే ఉంది. ఆరుగాలం కష్టపడి చి'వరి'కి ధాన్యం అమ్ముదామంటే తేమ శాతం, గోనె సంచుల కొరత తదితర అంశాలు రైతుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. ఇక మండలంలో వరి కోతలు ప్రారంభమై రెండు వారాలు గడుస్తున్నా... పూర్తిస్థాయి కోతలు చేపట్టలేదు. ఎందుకంటే రైతులకు కూలీల కొరత వేధిస్తోంది. ముఖ్యంగా మత్స్యకార గ్రామాల నుంచి కొంతమంది కూలీలు వలసలు వెళ్లిపోవడం, ఇటీవల కొన్ని మత్స్యకార గ్రామాల్లో కూలీలు అనారోగ్యానికి గురవడం ఖరీఫ్ రైతులపై తీవ్రమైన ప్రభావం చూపిస్తోంది. పంట పూర్తిస్థాయిలో పండినా ఇప్పటివరకు కనీసం 20 శాతం దాటించి కోతలు దాటకపోవడం గమనార్హం. మరోవైపు కోత మిషన్లు కూడా సమయానికి అందుబాటులో లేకపోవడం ఇటీవల కురిసిన వర్షానికి కొన్ని పొలాలు మిషన్లకు సహకరించలేదు. వెరసి రైతుకు చి'వరి' వరకూ ఖరీఫ్ కష్టాలు తప్పడం లేదు.

పిక్నిక్‌లో అపశృతి

సముద్ర స్నానానికి వెళ్లి యువకుడు మృతి

ప్రజాశక్తి - మందస

మండలంలోని రట్టి సముద్ర తీరంలో ఆదివారం పిక్నిక్‌లో అపశృతి చోటు చేసుకుంది. సముద్రంలో స్నానానికి వెళ్లిన మహావీర్ (29) మృతి చెందారు. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన మహావీర్ మందసలో స్వీట్ షాపు నిర్వహిస్తూ... జీవనం సాగిస్తున్నారు. ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి రట్టి సముద్ర తీరానికి పిక్నిక్ కోసం వెళ్లారు. ఉదయం అల్పాహారం తీసుకున్న తరువాత మధ్యాహ్నం 12 గంటల సమయంలో స్నేహితులతో కలిసి సముద్రంలోకి స్నానానికి వెళ్లారు. మహావీర్, స్నేహితులు కలిసి సముద్రంలోని 500 మీటర్ల దూరం వెళ్లారు. అక్కడ ఉధృతి అలలకు మహావీర్ కొట్టుకుపోయాడు. ఆయనను కాపాడేందుకు స్నేహితులు శ్రమించారు. అయినా ప్రయోజనం లేకుండాపోయింది. సాయంత్రం 5 గంటల సమయంలో మృతి చెందుతూ మృతదేహం ఒడ్డుకు కొట్టుకొచ్చింది. మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా విషాద ఛాయలు అలముకున్నాయి. మృతుడికి చెల్లెలు సుఖి ఉన్నారు. మందస పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రోదిస్తున్న చెల్లెలు సుఖి

లీజు రద్దుకు సంతకాల సేకరణ

ప్రజాశక్తి - కొత్తూరు

నివగాం ఆర్‌టిసి కాంప్లెక్స్ లీజు రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. లీజు రద్దు చేయాలని కోరుతూ మండల కేంద్రంలోని ఆదివారం సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నివగాం కేంద్రంలో ప్రజలు, ప్రయాణికులు సౌకర్యార్థం 1995లో ఆర్‌టిసి కాంప్లెక్స్ నిర్మించారని అన్నారు. వచ్చే పదేళ్లకు ఆర్‌టిసి ఉన్నతాధికారులు లీజుకు ఇచ్చారని అన్నారు. సంబంధిత వ్యక్తి ప్రజలు, ప్రయాణికులు, విద్యార్థులు కూర్చోవడానికి, నిల్చోవడానికి కూడా అవకాశం లేకుండా షాపులను నిర్మిస్తున్నారని అన్నారు. రోజూ వందలాది మంది ప్రయాణికులు వేచి ఉండే కాంప్లెక్స్ లేకుండా చేస్తున్నారని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకుని ప్రజలు, ప్రయాణికులు సౌకర్యార్థం అధికారులు ఇచ్చిన లీజు రద్దు చేయాలని, లేకుంటే ప్రజల మద్దతుతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆలవెల్లి రాంబాబు, పూర్ణచంద్ర పట్నాయక్, బి.సత్యాలు, రాజు, అప్పలరాజు, అక్కులు పాల్గొన్నారు.



సంతకాలను సేకరిస్తున్న ప్రసాద్

రేపు జాబ్‌మేళా

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 17న జాబ్‌మేళా నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ జాబ్‌మేళాకు డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. చిన్న తరహా పరిశ్రమల విభాగం ఆధ్వర్యాన జాబ్‌మేళా నిర్వహిస్తామని అన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ధ్రువపత్రాలు, ఫొటోలు, ఆధార్ కార్డులతో హాజరు కావాలన్నారు. ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



భావనపాడు తీరానికి వచ్చిన పర్యాటకులు

భావనపాడు తీరంలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - నౌపడ

సంతబొమ్మాళి మండలం భావనపాడు సముద్ర తీరంలో ఆదివారం పర్యాటకులతో సందడి వాతావరణం నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి విహారయాత్రకు వచ్చిన జనంతో సముద్ర తీరం కిక్కిరిసిపోయింది. జిల్లా నలుమూలల నుంచి, ఒరిశా నుంచి వాహనాలతో పర్యాటకులు రావడంతో భావనపాడు ప్రాంతం రద్దీగా మారింది. సరుగుడు తోటలు, జీడి తోటల్లో సేదతీరి సముద్రంలో స్నానం చేస్తూ... కేరింతలు కొట్టారు.

పలువురు యాత్రికులు ఏర్పాటు చేసిన సౌండ్ సిస్టం వద్ద డిజె పాటలకు చిందులు వేశారు. నౌపడ ఎస్‌ఐ నారాయణస్వామి ఆధ్వర్యాన పోలీసు సిబ్బంది, భావనపాడు మెరైన్ పోలీస్ సిబ్బంది అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా రక్షణ చర్యలు చేపట్టారు.

ప్రీ ప్రైమరీ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ

- పిల్లలు, బాలింతలు, గర్భిణులకు సమతులాహారం
- రక్తహీనత లేని సమాజానికి కృషి
- ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి బి.శాంతిశ్రీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అంగన్వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ 1,2 తరగతుల నిర్వహణపై శ్రద్ధ చూపుతున్నామని ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ బగాది శాంతిశ్రీ అన్నారు. అంగన్వాడీ కేంద్రాలపై ప్రత్యక్ష పర్యవేక్షణ మంచి ఫలితాలు ఇస్తోంది. ప్రధానంగా మహిళల అభివృద్ధికి పూర్తి తోడ్పాటు అందించాలంటే ఆరోగ్య వంతమైన జీవనం అవసరమని అన్నారు. అందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా ప్రజలకు అందించడమే సమగ్ర మహిళాభివృద్ధిశాఖ లక్ష్యమని అన్నారు. జిల్లాలో రక్తహీనతలేని సమాజానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రతి కార్యకర్తా సమయపాలన తప్పక పాటించాలని సూచించారు. కేంద్రల ద్వారా అందించాల్సిన సేవలను క్రమం తప్పకుండా ప్రజలకు అందించాలని సూచించారు. గర్భినులకు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించడం, ప్రీప్రైమరీ స్కూళ్ల నిర్వహణ బాధ్యత కార్యకర్తలపై ఉంటుందన్నారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కూడా ఉంటుందని తెలిపారు. సమగ్ర మహిళాభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషిచేస్తున్నామని అన్నారు. 'ప్రజాశక్తి' ముఖాముఖిలో పలు విషయాలను వెల్లడించారు.

? జిల్లాలో ఐసిడిఎస్ ద్వారా లబ్ధి ఎలా చేకూరుతోంది?

జిల్లాలో సమగ్ర స్త్రీ శిశుసంక్షేమశాఖ పరిధిలో 16 ప్రాజెక్టుల ద్వారా సేవలు అందిస్తున్నాం. వాటి పరిధిలో 3,358 కేంద్రాలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిర్వహిస్తాం. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 11,480 మంది గర్భిణులు, 11,952 మంది బాలింతలు, 79,871 మంది చిన్నారులకు ఈ కేంద్రాల ద్వారా సేవలు అందుకుంటున్నారు. వారి సంరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అందిస్తున్నాం.

? జిల్లాలో ప్రీప్రైమరీ 1,2 తరగతుల బోధన ఎలా సాగుతోంది?

జిల్లావ్యాప్తంగా ఐసిడిఎస్ పరిధిలో 16 ప్రాజెక్టులు నడుస్తున్నాయి. అందులో భాగంగా 3,358 కేంద్రాలను ఏర్పాటు చేశాం. పెద్ద కేంద్రాలను, మినీ కేంద్రాలను ఏర్పాటు చేశాం. పెద్ద కేంద్రాల్లో అంగన్వాడీ కార్యకర్తతో పాటు సహాయకులు పనిచేస్తున్నారు. మినీ కేంద్రాల్లో మాత్రం కార్యకర్తకే పూర్తి బాధ్యతలు అప్పగించాం. ప్రీప్రైమరీ తరగతుల నిర్వహణకు అవసరమైన పుస్తకాలను ఇప్పటికే అంగన్వాడీ కేంద్రాలకు పంపించాం. ప్రభుత్వం కొత్త పాఠ్య పుస్తకాలను సరఫరా చేయడంతో పూర్వ ప్రాథమిక విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.





మూడేళ్లలోపు చిన్నారులకు ప్రీప్రైమరీ-1, మూడు నుంచి ఆరేళ్లలోపు వారిని పీపీ-2గా విభజించి పాఠాలు బోధించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ప్రస్తుతం పీపీ-1కు 16,791 పుస్తకాలు, పీపీ-2కు సంబంధించి 12,447 పుస్తకాలను జిల్లాకు పంపారు. వాటిలో ఒక్కో విద్యార్థికి ఐదేసి పుస్తకాలు ఇస్తున్నాం. ఈ కేంద్రాల్లో 'తెలుగు అభ్యాస దీపిక'ను అందజేశాం. అందులోని అ, ఆ, ఇ, ఈ చిన్నారులు నేర్చుకునేందుకు వీలు కల్పిస్తూ ఆట పాటలతో చదువుపై ఆసక్తి పెంచేందుకు వీలు కల్పించాం.

? ఆరోగ్య సేవలు ఎలా అందుతున్నాయి?

జిల్లాలో సుమారు లక్ష మందికి పైగా తల్లులకు, పిల్లలకు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందుతున్నారు. తల్లులు, పిల్లల ఆరోగ్యంపై దృష్టిసారించడంలో ఎలాంటి అలసత్వానికీ తావు లేకుండా పథకాల అమలుపై శ్రద్ధ చూపుతున్నాం. మాతాశిశు మరణాలతో పాటు తల్లీబిడ్డల మరణాల రేటు తగ్గడమే ప్రధాన లక్ష్యం. చిన్నారుల పెరుగుదల పర్యవేక్షణ (గ్రోత్ మానిటరింగ్) చేస్తున్నాం. క్షేత్రస్థాయి తనిఖీలు పెంచాం. మారుమూల ప్రాంతాల్లో ఉన్న కేంద్రాలపై మరింత నిశిత పరిశీలిస్తున్నాం.

? కేంద్రాల్లో సమయపాలన ఎలా ఉంది?

జిల్లావ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు సమయపాలన తప్పని సరి. నిర్ధేశించిన ప్రకారం పేస్ రికగ్నైజేషన్ ప్రకారం హాజరు తప్పనిసరి అమలు చేస్తున్నాం. నిత్యం కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. ఈ బాధ్యతలను సూపర్ వైజర్లు కేంద్రాల వారీగా పర్యవేక్షిస్తున్నారు.

? గర్భిణులకు, చిన్నారులకు రోగనిరోధక శక్తిని పెంచడానికి వ్యాక్సినేషన్ ఎలా సాగుతోంది?

జిల్లాలో గర్భిణులకు, చిన్నారులకు క్రమం తప్పకుండా వాక్సినేషన్ ప్రక్రియ సాగుతుంది. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న వెల్‌నెస్ సెంటర్లలో ఈ వాక్సినేషన్ వేస్తున్నాం. ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీల సమన్వయంతో వాక్సినేషన్ ప్రోగ్రాంను నిర్వహిస్తాం. అలాగే వాక్సినేషన్ ప్రక్రియ వైద్య ఆరోగ్యశాఖ, ఐసిడిఎస్ శాఖల మధ్య నివేదికల్లో తేడాలు రాకుండా సమన్వయంతో పనిచేయాలి. వాక్సినేషన్‌పై దృష్టి సారించి శతశాతం వాక్సినేషన్ పూర్తిచేయాలి. ప్రతినెలా మాసాంతానికి ఈ నివేదికలు పంపించాల్సి ఉంటుంది. దీనికి తోడు ప్రభుత్వం రూపొందించిన యాప్‌ల్లో ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వాలి. అలసత్వం ఉన్న వారిపై చర్యలు తప్పవు.

అమరజీవి పొట్టి శ్రీరాములు


లావేరు : నివాళ్లర్పిస్తున్న గ్రంథాలయాధికారి, విద్యార్థులు


శ్రీకాకుళం అర్బన్ : చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న ఉద్యోగులు


శ్రీకాకుళం అర్బన్ : నివాళ్లర్పిస్తున్న డిసిసి అధ్యక్షులు కృష్ణారావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు ఆజరామమని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని బొడ్డేపల్లిపేటలో ఉన్న జగనన్న ప్రజా సేవా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగు మాట్లాడే వారికి భాషా ప్రాతిపదికన ప్రత్యేక రాష్ట్రం కావాలని 58 రోజులు నిరాహారదీక్ష చేశారన్నారు. 1953 డిసెంబర్ 15న మన తెలుగుజాతి కోసం ఆత్మార్పణ కావడం జరిగిందని గుర్తు చేశారు. అంతటి మహనీయున్ని ఆయన త్యాగాన్ని భావితరాలు గుర్తు చేసుకోవల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో సరుబుజ్జిలి జెడ్‌పిటిసి సురవరపు నాగేశ్వరరావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లావేరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గ్రంథాల య సహాయకుడు టి.వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. కలెక్టరేట్ ఎఒ సూర్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది పొట్టి శ్రీరాములుకు ఘన నివాళ్లర్పించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమశాఖ అధికారి అనురాధ, జిల్లా పౌర సరఫరాల అధికారి సూర్యప్రకాశరావు, కలెక్టర్ కార్యాలయంలోని పలు విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయంలో..

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో కార్యదర్శి బుర్రి కుమార్ రాజు, డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్.శంకరరావు, పి.వరలక్ష్మి, పి.రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.


మెళియాపుట్టి : చిత్రపటానికి పూలమాల వేస్తున్న అనురాధ

టిడిపి కార్యాలయంలో...

నగరంలోని 80 అడుగుల రోడ్డులో ఉన్న టిడిపి కార్యాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గొండు శంకర్ హాజరై చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో నగర టిడిపి అధ్యక్షులు మాదారపు వెంకటేష్, గుత్తు చిన్నారావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యాలయంలో..

తనగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో డిసిసి అధ్యక్షులు అంబటి కృష్ణారావు, నగర అధ్యక్షులు రెల్ల సురేష్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు ఈశ్వరి హాజరై పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లక్ష్మణరావు, బేగ్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

వైసిపి ఆధ్వర్యాన..

నగరంలోని పాత బస్టాండ్ వద్ద గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, అందవరపు సూరిబాబు, శ్రీనివాసరావు, కెవి సత్యనారాయణ, అందవరపు రమేష్, ఇతర నాయకులు పుష్పాంజలి ఘటించారు.

గిరిజన సంక్షేమ శాఖ..

నగరంలోని బాలుర ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దేవళ్ల శ్రీనివాసరావు హాజరై నివాళ్లర్పించారు.

స్థానిక పొట్టి శ్రీరాములు జంక్షన్‌లో పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతిని పురస్కరించుకొని కళింగ కోమటి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బోయిన గోవిందరాజులు విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేశారన్నారు. కార్యక్రమంలో ఉన్న నాగరాజు, పివి రమణ, కోరాడ రమేష్, వైశ్యరాజు మోహన్, పిట్టా భాగ్య చందరరావు, అందవరపు రఘు తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మెళియాపుట్టి శాఖాగ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి ఆర్.అనురాధ శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వేణు, సునీత, నీలిమ, శంకర్, హేమలత పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పట్టి శ్రీరాములు చిత్రపటానికి వార్డు కౌన్సిలర్ బచ్చు జగన్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర, లక్ష్మణరావు, తిరుపతి, పాల్గొన్నారు.

టెక్కలి : టెక్కలి గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి గ్రంథాలయాధికారి బి.రూపావతి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సహాయకులు అమ్మన్నమ్మ పాల్గొన్నారు.


ఆమదాలవలస : చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న రవికుమార్


శ్రీకాకుళం అర్బన్ : నివాళ్లర్పిస్తున్న వైసిపి జిల్లా అధ్యక్షులు కృష్ణదాస్


ఇచ్ఛాపురం : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న జగన్, తదితరులు



మాట్లాడుతున్న గణేష్

ఎల్ఐసి, జిఐసిల చట్టసవరణ నష్టదాయకం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ రంగంలో ఉన్న ఎల్ఐసి, జిఐసి సంస్థలను నష్ట పరిచే బీమారంగ చట్ట సవరణల వల్ల ఇన్సూరెన్స్ రంగ పెన్షనర్లకు నష్ట దాయకమని విశాఖ డివిజన్ ఇన్సూరెన్స్ పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బి.బి.గణేష్ అన్నారు. ఆదివారం సంఘం శ్రీకాకుళం జిల్లా శాఖ సమావేశం నగరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1938 ఇన్సూరెన్స్ చట్టం, 1956 ఎల్ఐసి చట్టం, 1999 ఐఆర్‌డిఎ చట్టాలకు ప్రతిపాదించిన మార్పులు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉంటున్న ఎల్ఐసిని, ఫీల్డ్ సిబ్బందిని కష్టాల్లోకి నెట్టేవిగా ఉన్నాయన్నారు. భీమా రంగంలో చట్ట సవరణలను ప్రజాసంఘాలు వ్యతిరేకిస్తున్నాయన్నారు. పెన్షనర్లకు అప్ డేషన్, మెడికల్ అలవెన్స్, కమ్యూటేషన్, ఎక్స్‌గ్రేషియో చెల్లింపుల్లో వివక్షత వంటి అంశాలపై ఆల్ ఇండియా పెన్షనర్ల సంఘం అభిప్రాయాలను పరిగణనలోనికి తీసుకోవాలన్నారు. ఎల్ఐసి, జిఐసిలలో వేల సంఖ్యలో ఏళ్ల తరబడి ఉన్న ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని, సాధారణ భీమా సంస్థలోని ఫ్యామిలీ పెన్షన్‌ను 30 శాతానికి పెంచాలని సమావేశంలో సభ్యులు తీర్మానించారు. ఈ సమావేశానికి కె.నారాయణ అధ్యక్షత వహించారు. కార్యదర్శి ఎం. ఆది నారాయణమూర్తి నివేదికను సమర్పించారు. సమావేశంలో శ్రీకాకుళం, నరసన్నపేట, పలాస, రాజాం ఇన్సూరెన్స్ పెన్షనర్లు పాల్గొన్నారు.


పాల్గొన్న సభ్యులు

పేదలను ఆదుకోవడమే లక్ష్యం

వజ్రపుకొత్తూరు: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే సంస్థ లక్ష్యమని ఉద్దానం అభ్యుదయ సేవా సమితి అధ్యక్షులు తామాడ లక్ష్మణరావు అన్నారు. మండలంలోని కొమరల్తాడలో సంస్థ రెండో వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలు, ఆరోగ్య సమస్యలు వల్ల ఆర్థికంగా చితికిపోయిన వారికి తమ సంస్థ అండగా నిలుస్తుందన్నారు. సంస్థ చేపడుతున్న ఆర్థిక కార్యక్రమాలకు సహకరిస్తున్న ఉద్దాన ప్రాంత అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటివరకు పన్నెండు మంది వ్యక్తులకు రూ.1.20 లక్షలు ఆర్థికసాయం అందజేసినట్టు చెప్పారు. 95 మంది సభ్యులు సంస్థ చేపట్టే కార్యక్రమంలో నిరంతరం పాలుపంచుకుంటున్నారని అన్నారు. ఈ సందర్భంగా సేవా సమితి మహిళా సభ్యులకు చిరు సత్కారం నిర్వహించారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు సిహెచ్.మోహనరావు, ఎం.మహేష్, నీలయ్య, జి.రవి, జి.వెంకటేష్, డి.పవన్‌కుమార్, ఎల్.నాగరాజు, ఎం.బాబూరావు, కె.కృష్ణారావు పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమమే ధ్యేయం

లావేరు: కార్యకర్తల సంక్షేమమే టిడిపి ధ్యేయమని ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్య దొర అన్నారు. ఆదివారం మండల కేంద్రం లావేరులో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారందరూ టిడిపి సభ్యులుగా చేరాలని, ప్రమాద బీమాతో పాటు పలు రకాలుగా ప్రయోజనాలు ఉన్నాయన్నారు. టిడిపి నాయకులు లంకలపల్లి జగ్గన్నదొర, శ్రీనువాసరావు, మాజీ సర్పంచ్ మాకన శంకరరావు, ఎల్.బాబు, ఆనందరావు, అప్పారావు, జీవానందం తదితరులున్నారు.

మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతాం

ఎమ్మెల్యే కూన రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

మహిళలను పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆదివారం పురపాలక సంఘ పరిధిలోని 10వ వార్డు మెట్టక్కివలసలోని హడ్కో కాలనీలో ఐసిడబ్ల్యూడిఎస్ (సమగ్ర శిశు మహిళాభివృద్ధి సంస్థ) ఆధ్వర్యంలో మైక్రో లెండింగ్‌లో భాగంగా ఐసిడబ్ల్యూడిఎస్ సంస్థలో నమోదైన ఎస్‌డిజి గ్రూపు సభ్యులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమగ్ర శిశు, మహిళాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎస్‌డిజి గ్రూపు సభ్యులకు నిత్యావసర సరుకులను అందజేయడం ఆనందంగా ఉందన్నారు. టిడిపి ప్రభుత్వం, సిఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడానికి పలు ప్రణాళికలను రచిస్తుందన్నారు. మహిళలకు ఒక నెలకు సరిపడేలా నిత్యావసర వస్తువులను ఐసిడబ్ల్యుడిఎస్ వెయ్యి రూపాయలకే అందించడం శుభ పరిణామమన్నారు. రానున్న రోజుల్లో మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని వ్యాపారాల్లో రాణించి ఆదాయాన్ని పెంపొందించుకోవాలన్నారు. నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్ పథకం కింద నియోజకవర్గంలో ఆమదాలవలస, పొందూరు మండలాలు ఎంపికయ్యాయన్నారు. అనంతరం ఐసిడబ్ల్యుడిఎస్ రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సంస్థ అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని మహిళలను కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 60 వేల మహిళా బృందాలకు స్వయం ఉపాధి కల్పించడం జరిగిందన్నారు. ఈ సంస్థ నాలుగు రాష్ట్రాల్లో పని చేస్తున్నదని, మహిళలకు స్వీయ ఆర్థిక అభివృద్ధికి ఆర్థికంగా సహకరిస్తు వారి జీవనసాధికి ఉపయోగపడే వివిధ రకాల వస్తు ఉత్పత్తికి శిక్షణ పరిశ్రమ స్థాపనకు పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. మహిళలకు సంస్థ నిర్వహిస్తున్న కార్యకలాపాలపై అవగాహన కల్పించి వారు ఆర్థిక అభివృద్ధి సాధించే దిశగా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బోర గోవిందరావు, నియోజకవర్గ యాదవ సంఘం అధ్యక్షులు నాగళ్ల మురళీధర్ యాదవ్, ఎన్ని శ్రీదేవి, రాడ విజయ్ కుమార్, సదాశివుని వెంకటేశ్వరరావు, ఐసిడబ్ల్యుడిఎస్ మండల ఎగ్జిక్యూటివ్ ఎం.ధనలక్ష్మి, స్వయం సహాయక సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్


చిరంజీవిని అవార్డుతో సత్కరిస్తున్న సాధికార సంస్థ ప్రతినిధులు

సిక్కోలు రైతుకు ఉత్తమ ప్రకృతి సేద్య అవార్డు

ఆమదాలవలస: విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీలో జరుగుతున్న ఆర్గానిక్ మేళా కార్యక్రమంలో మండలానికి చెందిన నిమ్మతొర్లాడకు చెందిన ప్రకృతి సేద్యపు రైతు నక్క చిరంజీవికి రైతు సాధికారసంస్థ ప్రకృతి వ్యవసాయ ఉత్తమ రైతు అవార్డుతో సన్మానించినట్లు డిపిఎం రేవతి తెలిపారు. ఈ సందర్భంగా రైతు చిరంజీవి మాట్లాడుతూ గత తొమ్మిది సంవత్సరాల నుంచి ప్రకృతి వ్యవసాయంలో చెరుకు, వరి పంటలను సాగు చేస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయం చేయడం అంటే తనకు చాలా ఇష్టమన్నారు. ఎందుకంటే ప్రకృతిలో అనేక వనరులు సహజంగానే లభిస్తున్నప్పటికీ రైతులు అధిక దిగుబడులను ఆశించి అవసరం లేకపోయినప్పటికీ ఇష్టానుసారంగా విపరీతంగా పురుగు మందులు, ఎరువులను ఉపయోగించి నేల తల్లిని విషతుల్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వ్యవసాయంలో అవార్డు రావడం తనకు చాలా ఆనందంగా ఉందని అలాగే ప్రకృతి వ్యవసాయంలో నాకు అవసరమైనటువంటి సహాయ సహకారాన్ని, ప్రోత్సాహాన్ని అందిస్తున్న డిపిఎమ్ రేవతికి ఈ సందర్భంగా ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ అధికారులు, మార్కెటింగ్ ఎన్ఎఫ్ఎ శివాజీ తదితర ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

ఇచ్ఛాపురం : పట్టణ పోలీస్‌స్టేషన్‌లో హెచ్‌సిగా విధులు నిర్వహిస్తున్న తెలకల రామారావు 50 మంది నిరుపేదలకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. చలితీవ్రత ఎక్కువగా ఉండటంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించారు. వెంటనే స్పందించిన హెచ్‌సి పరిధిలోని పేదలకు ఆహార పొట్లాలు అందజేసి కొంత ఆర్థికసాయాన్ని అందించి ఉదారతను చాటుకున్నారు. ఏటా చలికాలంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు రామారావు తెలిపారు.


దుప్పట్లను పంపిణీ చేస్తున్న రామారావు

ఆవు పాల సేకరణ ధర పెంచాలి

ప్రజాశక్తి- లావేరు

విశాఖ డెయిరీ తగ్గించిన ఆవు పాలు సేకరణ ధర వెంటనే పెంచాలని, ఆవుపాలకు గిట్టుబాటు ధర ఇవ్వాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల.రమణ డిమాండ్ చేశారు. మండలం లావేటిపాలెంలో ఎపి పాల రైతుల సంఘం ఆధ్వర్యంలో ఆవుపాలు సేకరణ ధర తగ్గించడాన్ని నిరసిస్తూ పాల రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ డెయిరీ రైతుల నుంచి పాల సేకరణ ధర లీటరుకు రూ.3 నుంచి రూ.5కు తగ్గించిందని, ఇప్పటికే పాల ధర గిట్టుబాటు కావడం లేదని, గడ్డి, దాణా, పశువైద్యం, కృత్రిమ గర్భధారణ అన్నింటికీ ధరలు పెరిగితే పాల సేకరణ పెంచకుండా తగ్గించడం అన్యాయమన్నారు. డెయిరీకి వచ్చిన లాభాలను డెయిరీ యాజమాన్యం ప్రతి ఏడాది వందలాది కోట్లు వివిధ రూపాల్లో అవినీతి, అక్రమాలు చేసి కాజేస్తున్నారని, నష్టాలను డెయిరీకి చూపిస్తున్నారని విమర్శించారు. పాల సేకరణ తగ్గించడం వలన ఒక్కో రైతు నెలకు రూ.రెండు వేలు నుంచి రూ.10 వేలు వరకు నష్టపోతున్నారన్నారు. తగ్గించిన ఆవు పాలు ధర పెంచాలని కోరుతూ డిసెంబరు 16న శ్రీకాకుళంలో జిల్లా సిఐటియు కార్యాలయంలో జరిగే పాల రైతుల సదస్సు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇనపకుర్తి మహేష్, సూర్యనారాయణ, నాగరాజు, ఆర్.లక్ష్మణ్, శ్రీను, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.


ధర్నా నిర్వహిస్తున్న పాల రైతుల సంఘం నాయకులు


సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్యేలు, తదితరులు

ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యం


ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఐకమత్యంగా ఉంటేనే సమాజంలో అన్ని విధాల అభివృద్ధి సాధ్యమవుతుందని వక్తలు అన్నారు. ఆదివారం గార మండలం అంపోలు సమీపాన జిల్లా వెలమ సంఘం ఆధ్వర్యంలో వన భోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, గొండు శంకర్ మాట్లాడుతూ వెలమ సంక్షేమ భవనం నిర్మాణంతో పాటు, వసతులు సమకూర్చడానికి తమవంతు సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. ముందుగా చిన్నారులకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. బాలబాలికల సంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం అలరించాయి. ఐఎఎస్ పరీక్షల రెండవ స్థానం సాధించిన గొల్లంగి సతీష్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా వెలమ సంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్, పిఎసిఎస్ అధ్యక్షులు కింజరాపు ప్రసాద్, విశ్రాంత ఎఎస్‌పి కింజరాపు ప్రభాకర రావు, డాక్టర్ చెక్కా నారాయణరావు, దుంగ సుధాకర్, అంబటి రంగారావు, పంచిరెడ్డి అప్పల నాయుడు, చీడి రాంబాబు, ముద్దాడ అప్పలనాయుడు, వెలమల ఇంద్రసేనరావు, బగ్గు అసిరి నాయుడు ముద్దాడ రామ్మోహన్రావు, జయరాం, గంగు సీతాపతి పాల్గొన్నారు.

షేక్ సాబ్జీ ఆశయాలను కొనసాగిస్తాం

టెక్కలి: కీర్తిశేషులు, మాజీ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ ఆశయాలని కొనసాగిస్తామని యుటిఎఫ్ మండల అధ్యక్షులు పి.గణపతిరావు అన్నారు. సాబ్జీ ప్రథమ వర్ధంతి సందర్భంగా స్థానిక ఇందిరాగాంధీ కూడలి వద్ద ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ షేక్ షాబ్జీ ఉద్యమ పోరాటాలకు దిక్సూచిగా నిలిచిన షేక్ షాబ్జీ ఆశయాలని ముందుకు తీసుకువెళ్తామన్నారు. కార్యదర్శి వైకుంఠరావు, సీనియర్ నాయకులు పాలవలస ధర్మారావు, కుప్పిలి కామేశ్వరరావు, కురమాన దాలయ్య, దొంకన పాపారావు, మారం కుమారస్వామి, విజయ్‌కుమార్, సింహాచలం పాల్గొన్నారు.

పలాస : స్థానిక ఎంఆర్‌సి వద్ద షేక్ షాబ్జీ చిత్రపటానికి యుటిఎఫ్ నాయకులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.


పలాస : చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కె.రమేష్, జిల్లా అకడమిక్ కన్వీనర్ ఎల్.వి.చలం, ప్రధాన కార్యదర్శి సిద్ధు, జిల్లా కౌన్సిలర్ ఎస్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

మందస : మండలంలోని హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో షేక్ షాబ్జీ చిత్రపటానికి జిల్లా కార్యదర్శి గున్న రమేష్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈశ్వరరావు, సోమేశ్వరరావు, గోపాలకృష్ణ, గున్న రాజు, బి.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అమరజీవిని మరిచిన నాయకులు

ప్రజాశక్తి- టెక్కలి

ఆంధ్ర రాష్ట్ర నిర్మాణ సారథి, అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని స్థానికంగా ఉన్న నాయకులు, అధికారులు విస్మరించిన ఘటన స్థానికంగా చర్చినియాంసమైంది. పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ఉత్తర్వుల ప్రకారం ప్రతిఒక్క ప్రభుత్వ కార్యాలయాల్లోనూ పొట్టి శ్రీరాములు వర్ధంతిని నిర్వర్తించాలని ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొంది. గడచిన మూడు రోజుల క్రితం జారీ చేసిన ఈ ఉత్తర్వుల ప్రాప్తి మేరకు డివిజన్, నియోజకవర్గ కేంద్రమైన టెక్కల్లో ఏ ఒక్క కార్యాలయాల్లో కూడా పొట్టి శ్రీరాములు వర్ధంతి నిర్వర్తించకపోవడం గమనార్హం. అదేవిధంగా పట్టణంలో పలు రాజకీయ పార్టీల కార్యాలయాల్లో నాయకులు ఉన్నా... వారూ పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వర్తించకపోవడం విశేషం. శ్రీరాములుకు నివాళ్లర్పించడంలో పాలకులు, అధికారులు వ్యవహరించిన శైలి పలువురు మేధావులను విస్మయానికి గురిచేసింది.

ఒక్క అవకాశం ఇవ్వాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సుదీర్ఘకాలం పాటు ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ ఉపాధ్యాయ సమస్యలపై పూర్తిస్థాయిలో పోరాటం సాగించానని ఒక్క అవకాశం ఇచ్చి గెలిపించాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతల దుర్గారావు ఉపాధ్యాయులను కోరారు. నగరంలోని ఇలిసిపురం అంబేద్కర్ విజ్ఞాన్ మందిరంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయ శాసన మండలికి త్వరలో ఎన్నికలు జరగనున్న సందర్భంగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు (అరకు), పార్వతీపురం (మన్యం) జిల్లా ఉపాధ్యాయ నియోజక వర్గంలో బహుజన సంఘాలు, దాని మిత్ర సంఘాల అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నట్టు దుర్గారావు తెలిపారు. ఈ సమావేశంలో గంజి ఎజ్రా, దండాసి రాంబాబు (జాన్), అంపోలు ప్రతాప్, శీర రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

టిసిలకు అభినందనలు

ప్రజాశక్తి- పోలాకి

మండలంలో నిర్వహించిన సాగునీటి సంఘాల ఎన్నికలకు ఆరు సాగునీటి సంఘాలకు ఆరూ ఏకగ్రీవంగా ఎన్నిక కావడం అభినందనీయమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని మబగాం క్యాంపు కార్యాలయంలో ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులకు ఆదివారం అభినందించారు. వై.బి.వలస నీటి సంఘానికి అధ్యక్షునిగా మెండ మోహనరావు, ఉపాధ్యక్షునిగా బోర పద్మ, ఉరజాం నీటి సంఘానికి అధ్యక్షునిగా కిల్లి శ్రీరామ్మూర్తి, ఉపాధ్యక్షునిగా సింగుపురం విశ్వనాథం, పోలాకి నీటి సంఘానికి అధ్యక్షునిగా ఎం.వెంకట అప్పలనాయుడు, ఉపాధ్యక్షునిగా పంచిరెడ్డి రాజులు, డి.ఎల్.పురం నీటి సంఘానికి అధ్యక్షునిగా కోరాడ నాగరాజు, ఉపాధ్యక్షునిగా కెల్ల బాస్కరరావు, మబగాం నీటి సంఘానికి అధ్యక్షునిగా ధర్మాన అమ్మన్నాయుడు, ఉపాధ్యక్షునిగా ప్రగడ శ్రీనివాసరావు, ఈదులవలస నీటి సంఘానికి అధ్యక్షునిగా మెండ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షునిగా కోల్ల రామారావు ఎన్నికైన విషయం విదితమే. ఎమ్మెల్యేతో పాటు మండలస్థాయి నాయకులు, అధికారులు అభినందనలు తెలిపారు.


ఆర్థికసాయం చేస్తున్న సభ్యులు

కలాం ఫౌండేషన్ ఔదార్యం

ప్రజాశక్తి- కవిటి

జిబి సిండ్రోమ్ వ్యాధితో బాధపడుతున్న జి.కరపాడుకు చెందిన నర్తు జగ్గారావుకు అండగా నిలిచిన కలాం ఫౌండేషన్ మరోసారి తన ఔదార్యం చాటుకుంది. వివరాల్లోకి వెళ్తే... జి.కరాపాడుకు చెందిన జగ్గారావు జిబి సిండ్రోమ్ వ్యాధితో బాధపడుతూ శ్రీకాకుళం కిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. చికిత్స కోసం సుమారు రూ.7 లక్షలు ఖర్చవుతుందని, ఆరోగ్యశ్రీ వర్తించదని వైద్యులు తెలిపారు. దీంతో రెక్కాడితే గానీ డొక్కాడని జగ్గారావు కుటుంబం దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది. విషయం తెలుసుకున్న కలాం ఫౌండేషన్ సభ్యులు ఆదివారం ఆస్పత్రికి చేరుకుని జగ్గారావుకు రూ.20 వేలు అందించారు. స్వచ్ఛంద సంస్థలు, దాతలు ఉదారంగా స్పందించి జగ్గారావుకు అండగా నిలవాలని కోరారు.

పొంచి ఉన్న ప్రమాదం

- కూలడానికి సిద్ధంగా ఉన్న వంతెన
- ఆందోళనలో గ్రామస్తులు


ప్రమాదకరంగా నారాయణపురం ఎడమ కాలువ వంతెన

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని గుత్తావల్లి - కొల్లివలస ప్రధాన రహదారి పూర్తిగా గోతులమయం కావడంతో పాటు నాగావళి నది నారాయణపురం ఆనకట్ట ఎడమ కాలువపైనున్న వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. దీంతో సుమారు 30 గ్రాముల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. బూర్జ మండలంతో పాటు సంతకవిటి మండల ప్రజలు శ్రీకాకుళం, పాలకొండ పట్టణాలతో పాటు అంతర్రాష్ట్రాలకు వెళ్లేవారికి ప్రధాన వంతెన కావడంతో అనునిత్యం వందలాది వాహనాలు రాకపోకలు కొనసాగిస్తున్నాయి. అయితే ముఖ్యంగా రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుక లారీలు, ట్రాక్టర్లు ఎడతెరిపి లేకుండా రాకపోకలు సాగించడంతో ప్రస్తుతం ఈ వంతెన కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. అదే జరిగితే సుమారు 34 గ్రామాల ప్రజలు రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు భారీ లోడ్లతో లారీలు, ఇతర వాహనాలు రాకపోకలు సాగించడం వలన ప్రధానమైన రహదారి గోతులమయంగా మారింది. ఇదే విషయాన్ని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని గ్రామాస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్లు, వంతెన మరమ్మతులు జరిపి భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలని, ముఖ్యంగా గుత్తావల్లి, కొల్లివలస రహదారికి మరమ్మతులు జరిపి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అగ్నికుల క్షత్రియులకు అండగా ఉంటా

ప్రభుత్వ విప్ అశోక్

ప్రజాశక్తి- కవిటి

అగ్నికుల క్షత్రియులకు అండగా ఉంటానని ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. కవిటి అగ్నికుల క్షత్రియ సంఘ భవనంలో ఆదివారం ప్రభుత్వ విప్‌ని అగ్నికుల క్షత్రియులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అగ్నికుల క్షత్రియులకు ఆర్థిక స్వావలంబన కల్పించేలా వారికి ఎన్ఆర్‌జిఎస్ పనులు కల్పిస్తామని తెలిపారు. వారి వృత్తికి ఉపయోగపడే విధంగా అవసరమైన యంత్ర సామగ్రి సమకూర్చేందుకు సమాలోచన చేస్తున్నట్టు తెలిపారు. అమ్మవారి సింహద్వారం నుంచి మత్స్యకార గ్రామాలను కలుపుతూ పూర్తిస్థాయి రహదారి సౌకర్యం ఏర్పాటు చేస్తామని చెప్పారు. 12 ఏళ్లుగా తనకు అండగా ఉంటున్న అగ్నికుల క్షత్రియులతో తనకు ఎప్పుడూ సోదర భావమేనని, ఈ అభిమానం ఎల్లవేళలా తనపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ కుత్తుమ లక్ష్మణరావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, నాయకులు బెందాళం రమేష్, మణి చంద్రప్రకాష్, సీపాన వెంకటరమణ, ఆరంగి మధు, ఆరంగి త్రివిక్రమరావు, బెందాళం తిరుమలరావు, సంతోష్ పట్నాయక్, అగ్నికుల క్షత్రియ సంఘం నాయుడు పొల్లాయి లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.


విప్‌ను సన్మానిస్తున్న సభ్యులు